# సైకో పాత్రకు సై!

బెంగళూరు బొద్దుగుమ్మ.. వర్ష బొల్లమ్మ! కోలీవుడ్ ద్వారా చిత్రసీమలో అడుగుపెట్టింది. అగ్రనటులు 'విజయ్' ద్వయంతో నటించే చాన్స్ కొట్టేసి.. '96', 'బిగిల్' విజయాల్లో పాలుపంచుకున్నది. టాలీవుడ్‌లోనూ ఎంట్రీ ఇచ్చి.. 'చూసీ చూడంగానే' తెలుగువారికీ నచ్చేసింది. ఆ తర్వాత 'మిడిల్ క్లాస్ మెలోడీస్'తో.. ఫస్ట్‌క్లాస్ హీరోయిన్‌గా మారిపోయింది. తాజాగా 'ఊరిపేరు భైరవకోన' ద్వారా.. హైదరాబాద్‌ను సొంతూరుగా మార్చుకున్నది. 'మెలోడీ' గీతాలంటే ఇష్టమంటున్న ఆ కోకిలమ్మతో.. మాటాముచ్చట!



మా కుటుంబానికి ఎలాంటి సినిమా నేపథ్యం లేదు. అయినా, నాకు చిన్నప్పటి నుంచే ఈ రంగంలోకి రావాలనే ఆసక్తి ఉండేది. ఈ మాట ఇంట్లో చెప్పగానే అమ్మానాన్న కూడా సపోర్ట్ చేశారు. నేను ఈ స్థాయికి రావడం వెనక వాళ్ల ప్రోత్సాహం ఎంతో ఉంది.

నేను చేసే ప్రతి సినిమా నుంచీ ఏదో ఒక కొత్త విషయం నేర్చుకుంటా. దాన్ని తదుపరి సినిమాలో ఇంప్లిమెంట్ చేస్తా.

చిన్నప్పటి నుంచీ సీనియర్ నటి రేవతి అంటే ఇష్టం. ఏ పాత్ర అయినా.. చాలా అద్భుతంగా పండిస్తారు. ఇప్పటివారిలో అపర్ణా బాలమురళి, పార్వతీ మేనన్ నటన నచ్చుతుంది.

సైకో పాత్ర చేయాలనేది నా డ్రీమ్. రామ్‌గోపాల్ వర్మ 'కౌన్'లో ఊర్మిళ పాత్ర లాంటిది ఎప్పటికైనా చేస్తాననే నమ్మకం ఉంది.

నేను పుట్టింది పర్యాటక ప్రాంతం కూర్గ్‌లో. అక్కడికి ఎప్పుడు వెళ్లినా.. మనసుకు ఎంతో ప్రశాంతంగా అనిపిస్తుంది. ఏదో తెలియని మధురానుభూతి కలుగుతుంది. అందుకే, సంవత్సరంలో కనీసం ఓ పదిసార్లయినా.. కూర్గ్ వెళ్తుంటా.

## కార్‌వాన్ కబుర్లు



రొమాంటిక్ కామెడీ, హారర్ జానర్ ఇష్టం. ఈ మూడూ కలగలిసిన చిత్రం.. 'ఎక్కడికి పోతావు చిన్నవాడా!'. ఇది నాకు బాగానచ్చిన సినిమా.

ప్రస్తుతం తెలుగుతోపాటు తమిళ, మలయాళ, కన్నడ చిత్రాల్లో నటిస్తున్నా. అన్ని భాషల ప్రేక్షకులూ నన్ను అభిమానిస్తున్నారు. తమ ఇంటి మనిషిగా భావిస్తున్నారు. ప్రేమిస్తున్నారు. అయితే, భాష తెలియకుంటే, ముఖంలో భావాన్ని పలికించలేమన్నది నా అభిప్రాయం.

'96'లో చిన్న క్యారెక్టరే అయినా మంచి గుర్తింపు వచ్చింది. ఆ తర్వాత 'బిగిల్'తో ఇండస్ట్రీలో నా స్థానం సుస్థిరమైంది. 'మిడిల్‌క్లాస్ మెలోడీస్'తో తెలుగువారికి మరింత దగ్గరయ్యా.

చాలా ఇష్టంతో సినిమా రంగంలోకి వచ్చాను. అయితే, ఇష్టంలేని పాత్రలను మాత్రం చేయను. సినిమాలో నా పాత్ర నాకు నచ్చకుంటే.. ఎంత పెద్ద ప్రాజెక్టు అయినా ఒప్పుకోను.

హైదరాబాదీ బిర్యానీ ఇష్టంగా తినేదాన్ని. కానీ, ఈ మధ్య నాన్‌వెజ్ మానేశాను. ప్రమాదంలో గాయపడ్డ ఓ కుక్కపిల్లను కాపాడి, ఇంటికి తెచ్చుకున్నాను. దాన్ని నేనే పెంచుకుంటున్నా. ఎందుకో.. ఆ క్షణంలోనే నాన్‌వెజ్ తినొద్దని డిసైడ్ అయ్యాను!

నేను పాజిటివ్ పర్సన్‌ను. నెగెటివిటీ అంటే అస్సలు నచ్చదు. అది ఇండస్ట్రీలో అయినా.. మరెక్కడైనా!